# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



News Portal Designing
Epaper Designing & Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com



సంపుటి : 3 | సంచిక : 325 | సోమవారం 13 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# విస్తరిస్తున్న ప్రచండ వేసవి



- ముందే వస్తోంది.. నెమ్మదిగా వెళ్తోంది
- గత 60 ఏళ్లలో వేసవికాలం నిడివి 30 రోజులు పెరిగింది
- కొన్ని నగరాల్లో మరింత ఎక్కువగా పెరుగుతోంది
- బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయ తాజా పరిశోధనలో వెల్లడి

హైదరాబాద్

వేసవి వేడి తీవ్రత పెరగటమే కాదు.. వేసవికాలం కూడా ఏటేటా పెరుగుతోంది. మాడు పగిలే ఎండల రోజులు ఏటేటా ముందుగానే ప్రారంభమై, ఆలస్యంగా ముగుస్తూ, మరింత తీవ్రంగా మారుతున్నాయి. వేసవి రోజుల సంఖ్య 1960 నాటి కంటే 2023 మధ్యలో సుమారు 30 రోజులు పెరి గిందని కెనడాలోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం నిర్వహించిన తాజా పరిశోధనలో వెల్లడైంది. భూమధ్య రేఖ కు దగ్గరి దేశాల్లో 6 దశాబ్దాల క్రితంతో పోలిస్తే వేసవి కాలాలు ముందుగానే కాక మరింత ఆకస్మికంగా వస్తున్నాయని, ఎక్కువ కాలం కొనసాగుతున్నాయని, వేడితీవ్రత ఏటేటా మరింత పెరుగుతోందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. వాతావరణంలో వేగవంతమైన మార్పులు చోటుచేసుకోవటం వల్ల ప్రతికూల పరిస్థితులకు అనుగుణంగా మారే శారీరక సామర్థ్యాన్ని ఇది దెబ్బతీస్తోంది. ఈ తాజా అధ్యయనం వివరాలు 'ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్ లెటర్స్'లో ప్రచురితమయ్యాయి. వేసవి రోజుల సంఖ్య తొలుత భూమిపై పెరిగాయి. ఆ తర్వాత సముద్రంలోనూ - మిగతా3లో



## దేశంలో ఒక తుక్డే-తుక్డే గ్యాంగ్ ఉంది

- సిలిగుడి కారిడార్‌ను విడదీస్తామని 'తుక్డే-తుక్డే' గ్యాంగ్ బెదిరిస్తోంది
- తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ప్రధాని నరేంద్ర మోదీ
- ఉత్తర బంగాల్‌ను నిర్లక్ష్యం చేసి మదర్సాలకు సుమారు రూ. 6,000 కోట్లు కేటాయించారని విమర్శ
- వారు ఈశాన్య ప్రాంతాన్ని దేశం నుంచి వేరు చేయాలని కోరుకున్నారు

## బిల్లుకు మద్దతితివ్వకుంటే
# చరిత్రహీనులు

- పార్లమెంటులో మహిళా బిల్లుకు అన్ని పార్టీలు మద్దతివ్వాలి
- మహిళా రిజర్వేషన్ బిల్లుతో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మకం
- మహిళల ప్రాతినిథ్యం పెరగాల్సిందే
- కేంద్ర మంత్రి బండి సంజయ్



## బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం

- ఏప్రిల్ 13 తర్వాత ప్రక్రియ ప్రారంభం
- రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత
- ఏప్రిల్ 13 తర్వాత ప్రక్రియ ప్రారంభం
- జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా వ్యాఖ్యలు






## అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం

- ఏప్రిల్ 15 నుంచి రిజిస్ట్రేషన్లు
- అమర్‌నాథ్ వార్షిక యాత్ర వివరాలను వెల్లడించిన జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్

# అటకెక్కిన 'రింగు'

- ఎన్‌హెచ్ఏఐ కీలక నిర్ణయం!
- ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి దక్కని ఆమోదం
- ఆర్థిక సంవత్సరం ముగిసిపోవటంతో ఇప్పట్లో అనుమతి కష్టమే
- టెండర్ల రద్దు యోచనలో ఎన్‌హెచ్ఏఐ




హైదరాబాద్

గేమ్ ఛేంజర్ అంటూ ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగురోడ్డు) విషయంలో అదిగో ఇదిగో అంటూ ఊరించి ప్రస్తుతానికి ఆ ప్రాజెక్టును కేంద్రం అటకెక్కించింది. దాదాపు ఏడాది క్రితమే ప్రాజెక్టు కోసం టెండర్లు పిలిచిన కేంద్ర ప్రభుత్వం, 2025--26 ఆర్థిక సంవత్సరంలో దానికి ఆమోదం తెలపలేదు. ఆర్థిక సంవత్సరం ముగిసిపోవటంతో ఏకంగా ఆ టెండర్లనే రద్దు చేసుకునే దిశగా యోచిస్తోంది. కొత్త ఆర్థిక సంవత్సరం ఇప్పుడు మొదలైనందున, ఈ ఏడాది కాలం సమయం ఉంది. దీంతో ప్రాజెక్టును పక్కన పెట్టేసినట్టుగానే తెలుస్తోంది. ప్రస్తుతానికి టెండర్లు తెరిచే గడువును మరో రెండు నెలలకు పొడిగించింది. ఆ తర్వాత రద్దు చేసి నవంబరు నాటికి కొత్త టెండర్లు - మిగతా3లో

## వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా

- బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చే ప్రతిపాదన ఉంది
- ఈ విషయంలో అధినేతదే తుది నిర్ణయం
- మంచిర్యాలలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్



మంచిర్యాల

వచ్చే ఏడాది ప్రజాసమస్యలపై పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని, గత ఎన్నికల్లో సిట్టింగ్‌లను మార్చిన చాలా చోట్ల గెలిచామన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఇంట్లో మీడియాతో కేటీఆర్ ప్రత్యేకంగా మాట్లాడారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కవిత పార్టీ ఏర్పాటుపై స్పందిస్తూ.. ఏ ఇంట్లోనైనా కన్నవారిని ఎవరూ ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించకూడదని, ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉందన్నారు. అయితే వ్యక్తిగత - మిగతా3లో



## పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవాలను మార్చలేరు

- అరుణాచల్‌ప్రదేశ్ అంశంలో చైనా తీరుపై భారత్ ఫైర్
- అరుణాచల్‌ప్రదేశ్‌లో పలు ప్రాంతాలకు చైనా పేర్లు పెట్టడంపై భారత్ మండిపాటు
- చైనా చర్యలను తీవ్రంగా ఖండించిన భారత్ అరుణాచల్‌ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే: కేంద్రం

## మహిళా రిజర్వేషన్‌ను అమలుచేసే టైం వచ్చింది



- లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు ప్రధాని లేఖ
- మహిళా రిజర్వేషన్ చట్టంపై ప్రధాని మోదీ లేఖ
- మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదానికి ఎంపీలంతా ఏకం కావాలని పిలుపు
- లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు బీజేపీ త్రీ లైన్ విప్

## మహిళల రిజర్వేషన్ అమలుకు కేంద్రం తొందరపాటు

- రాజకీయ లబ్ధి కోసమే: ప్రధానికి ఖర్గే లేఖ
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడంపై ఖర్గే కీలక వ్యాఖ్యలు
- రాజకీయ లబ్ధి కోసమే మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుకు ప్రభుత్వం తొందరపెడుతోందని ఆరోపణలు
- ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీకి లెటర్



# దేశంలో ఒక తుక్డే-తుక్డే గ్యాంగ్ ఉంది

తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఉత్తర బంగాల్ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అదే క్రమంలో మదర్సాలకు సుమారు రూ. 6,000 కోట్లు కేటాయించారని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల కనీస అవసరాలను విస్మరించి, బుజ్జగింపు రాజకీయాల్లో బిజీగా ఉందన్నారు. ఈశాన్య భారతాన్ని దేశాన్ని కలిపే వ్యూహాత్మకమైన సిలిగుఢి కారిడార్‌ను విడదీస్తామని 'తుక్డే-తుక్డే' ముఠా బెదిరిస్తోందన్నారు. అలాంటి వారికి ఎవీజ తన బుజ్జగింపు రాజకీయాల కోసం వీధుల్లో నుంచి పార్లమెంటు వరకు మద్దతు ఇచ్చిందని ప్రధాని ఆరోపించారు. ఉత్తర బంగాల్ నగరమైన సిలిగుఢిలోని కవాఖాలి మైదానంలో జరిగిన ఎన్నికల సభలో ప్రసంగించారు. ఈశాన్య ప్రాంతానికి ముఖద్వారంగా నిలిచే ఈ కారిడార్‌ను భారీ ఎత్తున అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

"దేశంలో ఒక 'తుక్డే-తుక్డే' గ్యాంగ్ ఉంది. అది సిలిగుఢి కారిడార్‌ను దేశం నుంచి విడదీస్తామని బెదిరిస్తోంది. వారు ఈశాన్య ప్రాంతాన్ని దేశం నుంచి వేరు చేయాలని కోరుకున్నారు. బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే ఎవీజ, అటువంటి వ్యక్తులకు వీధుల నుంచి పార్లమెంటు వరకు మద్దతు ఇస్తోంది. అదే ఎవీజ యొక్క నిజస్వరూపం. బీజేపీ దృష్టిలో సిలిగుఢి కారిడార్ అనేది దేశం, భద్రత, సమృద్ధికి సంబంధించిన ఒక కీలక మార్గం. ఈ ప్రాజెక్టు బంగాల్, సిక్కింలో రవాణా అనుసంధానాన్ని, వాణిజ్యాన్ని, పర్యాటకాన్ని



భారీగా పెంపొందిస్తుంది. అయితే, కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి ప్రాజెక్టుకు ఎవీజ అడ్డుపడుతోంది. ఉత్తర బంగాల్ పట్ల చూపుతున్న వివక్షకు ఎవీజ ప్రభుత్వ బడ్జెట్ ఒక నిదర్శనం. ఈ క్రూరమైన ప్రభుత్వం మదర్సాల కోసం సుమారు రూ. 6,000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. కానీ ఉత్తర బంగాల్‌లోని ఇంత విశాలమైన ప్రాంతం అభివృద్ధికి మాత్రం తగినంత బడ్జెట్‌ను కేటాయించడం లేదు. ఎవీజ పగలు, రాత్రి తేడా లేకుండా తన సొంత ప్రత్యేక ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకోవడంలోనే నిమగ్నమై ఉంది. ఉత్తర బంగాల్‌లోని అనేక జిల్లాల్లో భారీ వర్షాల బీభత్సంతో అంతటా అల్లకల్లోలం నెలకొంది. ఆ సమయంలో ఈ ఎవీజ ప్రభుత్వం కోల్‌కతాలో సంబరాలు చేసుకుంటోంది. ఎవీజ అనేది ఉత్తర బంగాల్ వ్యతిరేక పార్టీ."

15 ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేసిందని, కేంద్ర పథకాల అమలును అడ్డుకుందని ప్రధాని మోదీ ఆరోపించారు. దీని ఫలితంగా 25 శాతంలోపు పనులు మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. ఎవీజ గిరిజన, మహిళా, యువజన వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. ఈ క్రమంలోనే 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వానికి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చిన మోదీ, బంగాల్ రెట్టింపు వేగంతో అభివృద్ధిని సాధిస్తుందని చెప్పారు. బంగాల్ ప్రజల్లో తాను గమనిస్తున్న ఉత్సాహాన్ని బట్టి చూస్తే రాబోయే ఎన్నికల్లో ఎవీజ ఓటమి ఖాయమని తనకు నమ్మకం కలిగిందన్నారు.

"బంగాల్‌లోని వివిధ ప్రాంతాలను సందర్శించాను. అక్కడ యువత, తల్లులు, సోదరీమణులు, వృద్ధులు, గ్రామస్థుల్లో నేను చూసిన ఉత్సాహం, శక్తి, ఆవేశం నిజంగా అద్భుతం. ప్రజలు ఎన్నో కష్టాలను ఎదుర్కొని, మైళ్లు తరబడి నడిచి అక్కడికి వచ్చారు. బంగాల్ ఇప్పుడు మార్పు కోసం దృఢంగా నిశ్చయించుకుంది. ఈసారి ఎవీజ అధికారం కోల్పోవడం ఖాయం. మే 4వ తేదీ తర్వాత, బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది. అప్పుడు గత 15 ఏళ్లలో గడిపిన ప్రతి క్షణానికి మీరు లెక్క చెప్పాల్సి ఉంటుంది. ప్రతి పైసాకు మీరు జవాబుదారీగా ఉండాలి." అని ప్రధాని మోదీ అన్నారు. బంగాల్?లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికల జరగనున్నాయి. ఏప్రిల్ 23న మొదటి దశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ జరగనుంది. కాగా, మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం

దక్షిణ కశ్మీర్‌లోని పవిత్ర హిందూ క్షేత్రం అమర్‌నాథ్ యాత్ర 2026కు సంబంధించి తేదీలను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ ఏడాది యాత్ర జూలై 3 నుంచి ప్రారంభమై, మొత్తం 57 రోజుల పాటు కొనసాగి ఆగస్టు 28న రక్షా బంధన్ సందర్భంగా ముగియనుంది. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఆయన శ్రీ అమర్‌నాథ్‌జీ శ్రైన్ బోర్డు (ఎస్ఏఎస్‌బీ) చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

**ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా**

యాత్ర ప్రారంభానికి ముందు జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా జూన్ 29న తొలి పూజ (ప్రథమ పూజ) నిర్వహించనున్నారు. ఈ పూజతో యాత్రకు శుభారంభం అవుతుంది. ప్రతీ ఏడాది లాగే ఈసారి కూడా దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. యాత్రలో పాల్గొనాలనుకునే భక్తుల కోసం ఏప్రిల్ 15 నుంచి ముందస్తు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇది ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటుంది.

**ప్రతి యాత్రికుడికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి**

దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 550కి పైగా బ్యాంక్ శాఖల్లో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యెస్ బ్యాంక్ వంటి బ్యాంకులు ఈ ప్రక్రియలో భాగస్వామ్యం అవుతున్నాయి. అదేవిధంగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. యాత్రలో పాల్గొనే భక్తులకు వయోపరిమితులు కూడా విధించారు. 13 సంవత్సరాల లోపు పిల్లలు, 70 సంవత్సరాల పైబడిన వృద్ధులకు యాత్రలో పాల్గొనే అనుమతి లేదు. భక్తుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతేకాకుండా ప్రతి యాత్రికుడికి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. అమర్‌నాథ్ యాత్ర రెండు ప్రధాన మార్గాల ద్వారా కొనసాగుతుంది. అనంతనాగ్ జిల్లాలోని నున్వాన్--పహల్గాం మార్గం సంప్రదాయ మార్గంగా పరిగణించబడుతుంది. ఇది సుమారు 48 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంటుంది. మరోవైపు గందర్‌బల్ జిల్లాలోని బాల్టాల్ మార్గం సుమారు 14 కిలోమీటర్ల మాత్రమే ఉన్నప్పటికీ, ఇది కొంచెం కఠినమైన మార్గంగా భావిస్తారు.



భక్తులు తమ సామర్థ్యాన్ని బట్టి ఈ రెండు మార్గాల్లో ఏదైనా ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

యాత్రను సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడంతో పాటు వైద్య సదుపాయాలు, రవాణా, నివాస ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. గత కొన్నేళ్లుగా బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) ద్వారా పహల్గాం, బాల్టాల్ మార్గాలను మెరుగుపరిచారు. రహదారులను విస్తరించి, పక్కాగా నిర్మించడం వల్ల యాత్రికులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారింది. ఈసారి యాత్రలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. శ్రీనగర్, జమ్మూ ప్రాంతాల్లో బాబా బర్ఫానిగా ప్రసిద్ధి చెందిన అమర్‌నాథ్ స్వామికి అంకితంగా లేజర్, సౌండ్ షోలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జమ్మూ-కాశ్మీర్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇక భక్తుల భద్రత కోసం బీమా పరిమితిని కూడా పెంచారు. యాత్రికులు, సేవా సిబ్బంది, అధికారులు, పూజారులు, తాత్కాలిక కార్మికులకు ప్రమాద బీమాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు అధికారులు తెలిపారు. ఇది యాత్రలో పాల్గొనే వారందరికీ అదనపు భరోసా కల్పించనుంది.

ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు పాల్గొనే అమర్‌నాథ్ యాత్ర దేశంలోనే అత్యంత ముఖ్యమైన ఆధ్యాత్మిక యాత్రలలో ఒకటిగా గుర్తింపు పొందింది. 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్ గుహలో సహజంగా ఏర్పడే మంచు శివలింగాన్ని దర్శించుకోవడం కోసం భక్తులు కష్టసాధ్యమైన ప్రయాణాన్ని చేపడతారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన యాత్ర అనుభవాన్ని అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఏప్రిల్ 15 నుంచి ప్రారంభమయ్యే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొని, ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులు భక్తులకు సూచిస్తున్నారు.

# మహిళల రిజర్వేషన్ అమలుకు కేంద్రం తొందరపాటు

కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. బంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు చేయడానికి మోదీ సర్కార్ యత్నిస్తోందని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసమే మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుకు కేంద్రం తొందరపెడుతోందన్న భావనను బలపరుస్తోందని విమర్శించారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఖర్గే లేఖ రాశారు. "ఏప్రిల్ 16 నుంచి నారీ శక్తి వందన్ అధినియంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి సంబంధించిన మీ ( మోదీ) లేఖ నాకు అందింది. నారీ శక్తి వందన్ అధినియం-2023ని పార్లమెంట్ 2023 సెప్టెంబర్‌లో ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కీలకమైన చట్టం తక్షణమే అమలులోకి రావాలని నేను అప్పుడే డిమాండ్ చేశాను. ఈ చట్టాన్ని తక్షణమే అమలు చేయడానికి విస్తృత ఏకాభిప్రాయం ఉందని మీరు (మోదీ) లేఖలో పేర్కొన్నారు. అయినప్పటికీ దాన్ని ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదు. " అని ఖర్గే పేర్కొన్నారు. కాగా, ఏప్రిల్ 16 నుంచి నారీ శక్తి వందన్ అధినియంపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు ప్రధాని మోదీ ఇటీవలే లేఖ రాశారు. ఆ లేఖకు తాజాగా ఖర్గే బదులిచ్చారు. "నారీ శక్తి వందన్ అధినియం పార్లమెంట్‌లో ఆమోదం పొంది 30 నెలలు గడిచింది. ఇప్పుడు మమ్మల్ని పరిగణలోకి తీసుకోకుండానే ఈ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఎటువంటి వివరాలను వెల్లడించకుండానే, మళ్లీ మా సహకారాన్ని కోరుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలకు



సంబంధించిన వివరాలు లేకుండా ఈ చరిత్రాత్మక చట్టంపై ఎటువంటి ప్రయోజనకరమైన చర్చ జరపడం అసాధ్యం. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపిందని మోదీ లేఖలో పేర్కొన్నారు. అయితే ఇదంతా అబద్ధం. ఎందుకంటే బంగాల్ ఎన్నికలు 2026 ఏప్రిల్ 29న ముగుస్తాయి. అవి ముగిసిన తర్వాత ప్రతిపాదిత రాజ్యాంగ సవరణలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వాన్ని కోరాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్లమెంట్ స్పెషల్ సెషన్ ఏర్పాటు చేయడాన్ని మహిళలకు నిజమైన సాధికారత కల్పించడం కంటే రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వం చట్టం అమలును తొందరపెడుతోందన్న నమ్మకాన్ని మరింత బలపరుస్తోంది"

**'అన్ని పార్టీలు, రాష్ట్రాలకు తమ గొంతుకను వినిపించే ఛాన్స్ ఇవ్వాలి'**

నోట్ల రద్దు, జీఎస్టీ, జనాభా లెక్కలు, ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు, పన్నులు వంటి ప్రజా ప్రాముఖ్యత గల విషయాలలో ప్రభుత్వ గత పనితీరు ఏమాత్రం నమ్మకాన్ని కలిగించడం లేదని ఖర్గే ఆరోపించారు. ప్రణాళికలో ఉన్న రాజ్యాంగ సవరణలు కేంద్రం, రాష్ట్రాలు రెండింటినీ ప్రభావితం చేస్తాయని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎంత చిన్న సవరణ అయినా సరే అన్ని పార్టీలు, రాష్ట్రాలు తమ వాణిని వినిపించడం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఈ ప్రత్యేక సమావేశం దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, అందరినీ కలుపుకొని ముందుకు సాగడానికి ఉద్దేశించినదని మోదీ లేఖలో పేర్కొన్నారని ఖర్గే గుర్తు చేశారు. అయితే నారీ శక్తి వందన్ అధినియమ్- 2023 సవరణతో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించడానికి ఏప్రిల్ 29 తర్వాత ఎప్పుడైనా ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాను సూచిస్తున్నానని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ చట్టం పేరుతో నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ కొద్ది రోజుల క్రితం ఆరోపించింది. అంతేకాకుండా ఆ చట్టానికి అనుసంధానంగా ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమని మండిపడింది. దీనివల్ల తీవ్ర పరిణామాలు సంభవించవచ్చని విమర్శించింది.

'విపక్షాల అభ్యర్థనను ఖర్గే లేఖలో పునరుద్ఘాటించారు'

మరోవైపు, ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే రాసిన లేఖను ఎక్స్‌లో పోస్ట్ చేశారు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్) జైరాం రమేశ్. తమిళనాడు, బంగాల్‌లలో ఎన్నికల ప్రచారం మధ్యలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రధాని మోదీకి లేఖ రాశారని పేర్కొన్నారు. 2026 ఏప్రిల్ 29 తర్వాత ఎప్పుడైనా అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపక్షాల అభ్యర్థనను ఖర్గే పునరుద్ఘాటించారని రమేశ్ తన పోస్ట్‌లో వెల్లడించారు.

## పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవాలను మార్చలేరు



అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు చైనా పేర్లు పెట్టడంపై భారత్ తీవ్రంగా మండిపడింది. చైనా చేస్తున్న ఈ తరహా ప్రయత్నాలను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రకటన విడుదల చేసింది. భారత భూభాగంలోని ప్రాంతాలకు కల్పిత పేర్లు పెట్టడం ద్వారా చైనా సృష్టిస్తున్న అబద్ధపు కథనాలు ఏమాత్రం చెల్లవని పేర్కొంది. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ పునరుద్ఘాటించారు. భవిష్యత్తులోనూ భారత్‌లో భాగంగానే ఉంటుందని చెప్పారు. పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవాలను మార్చలేరని స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు ఈ చర్యలు అడ్డంకిగా మారుతున్నాయని జైస్వాల్ అభిప్రాయపడ్డారు. ఇటువంటి చర్యలు భారత్-చైనా సంబంధాల్లో ప్రతికూలతను నింపుతాయని పేర్కొన్నారు. పరస్పర అవగాహనను పెంపొందించుకునే ప్రయత్నాలను దెబ్బతీసే పనులకు చైనా స్వస్తి పలకాలని రణధీర్ జైశ్వాల్ హితవు పలికారు. ఇదిలా ఉండగా, ఇండియా-చైనా సంబంధాలు 2020లో తూర్పు లద్దాఖ్ సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ ఘటనల అనంతరం ఇరు దేశాలు సంబంధాలను పునరుద్ధరించేందుకు ఇరు పక్షాలు అనేక చర్యలు చేపట్టాయి. అయితే ఈ తరహా పరిణామాలు మళ్లీ ఉద్రిక్తతలను పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్‌గా పేర్కొంటూ తన హక్కు ఉందని చైనా వాదిస్తోంది. ఈ ప్రాంతాన్ని జాంగ్నాన్‌గా పిలుస్తోంది. కానీ భారత్ మాత్రం ఈ వాదనలను పూర్తిగా తిరస్కరిస్తోంది.

## బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం

బిహార్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఇటీవల రాజ్యసభ సభ్యత్వాన్ని స్వీకరించి, శాసన మండలికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో బీజేపీ, జేడీయూ నాయకులు ఆయనతో క్రమం తప్పకుండా సమావేశమవుతూ, భవిష్యత్ వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా పేర్కొన్నారు. అయితే ఆ ప్రక్రియ ఏప్రిల్ 13 తర్వాత ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఆదివారం, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్‌ను కలిసిన అనంతరం సంజయ్ ఝా విలేకరులతో మాట్లాడారు. "బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడేందుకు వీలుగా, నీతీశ్ ముఖ్యమంత్రి త్వరలో పదవి నుంచి వైదొలుగుతారని భావిస్తున్నాం. ఈ ప్రక్రియ ఏప్రిల్ 13 తర్వాత ప్రారంభమవుతుందని నేను భావిస్తున్నా" అయితే, సంజయ్ ఝా వెంట ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, జేడీయూ సీనియర్ నేత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌదరి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ చౌదరి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ సిఫార్సు మేరకు ఎన్?డీఏ శాసనసభ్యులు కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని తెలిపారు. "కొత్త ప్రభుత్వం ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ఈ విషయాల్లో వారికి ఒక నిర్దిష్ట ప్రక్రియ ఉంటుంది. వారు తమ ప్రణాళికతో ముందుకు వచ్చిన తర్వాత, తదుపరి చర్యలు జరుగుతాయి. బిహార్‌లో మొదటి సారిగా బీజేపీ ముఖ్యమంత్రి పదవిని పొందేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ అభ్యర్థిని మాత్రం కేంద్ర నాయకత్వమే ఎంపిక చేస్తుంది. అనంతరం ఎన్‌డీఏ శాసనసభ పక్షం ఆ పేరును ఆమోదిస్తుంది" అని విజయ్ కుమార్ చౌధరీ పేర్కొన్నారు.

**బిహార్ తదుపరి సీఎం ఎవరు**

ఇదిలా ఉండగా, బిహార్‌లో తొలిసారి బీజేపీ సర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. చాలా కాలంగా సీఎం పదవిలో కొనసాగిన నీతీశ్‌కుమార్ రాజ్యసభకు వెళ్లడంతో కమలం పార్టీకి మార్గం సుగమమైంది. దీంతో బీజేపీ నుంచి ముఖ్యమంత్రి పదవి ఎవరు చేపడతారనే విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే, సీఎం రేసులో బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్, ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హా పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే, ఉప ముఖ్యమంత్రిగా నీతీశ్? కుమారుడు, నిశాంత్ కుమార్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**ఉప ముఖ్యమంత్రిగా నిశాంత్ కుమార్!**

ఇటీవల నీతీశ్? కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్?? కూడా జేడీయూ పార్టీలో చేరారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రి లలన్ సింగ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ చౌదరి, సీనియర్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ సభ్యుడిగా జేడీయూ బలోపేతానికి కృషి చేస్తానన్నానని పార్టీలో చేరిన అనంతరం నిశాంత్ చెప్పారు. రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే పార్టీ లక్ష్యమన్నారు. తన తండ్రి నీతీశ్ రాజ్యసభకు వెళ్లడం ఆయన తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని, దానిని తాను స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. అయితే, ఇప్పటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న నిశాంత్, నీతీశ్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన కొన్ని రోజుల తర్వాత రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఇక తదుపరి బిహార్? ముఖ్యమంత్రి ఎవరనేది వేచి చూడాలి.

## మహిళా రిజర్వేషన్‌ను అమలుచేసే టైం వచ్చింది

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని దాని నిజమైన స్ఫూర్తితో అమలుచేసే సమయం వచ్చిందంటూ లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ లేఖ రాశారు. 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నుంచి మహిళా రిజర్వేషన్ కోటా అమల్లోకి వస్తుందని ఆయన వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ చట్టం (నారీ శక్తి వందన్ అధినియం)తో ముడిపడిన సవరణ బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించడానికి లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా ఏకం కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. విస్తృతమైన చర్చల తర్వాతే ఈ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తేవాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

**ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చారిత్రక చర్చ**

"2029 నుంచి మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వస్తే భారత ప్రజాస్వామిక సంస్థలకు కొత్త బలం లభిస్తుంది. వాటిపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. ప్రభుత్వాల పాలనలో ప్రజా భాగస్వామ్యం, ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది. దీనిపై ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చారిత్రక చర్చ మొదలుకానుంది. ఇందులో అన్ని పార్టీల ఎంపీలు భాగం కావాలి. కలిసికట్టుగా ముందుకు సాగేందుకు, అందరినీ మనతో కలుపుకు పోయేందుకు పార్లమెంటులో ఏకం అవుదాం. ఈ స్ఫూర్తితోనే నేను మీకు ఈ లేఖను రాస్తున్నాను. ఇప్పటికే మనమంతా అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని చూస్తున్నాం. మహిళలు శ్రమ, నిబద్ధతలతో తమ సామర్థ్యాలను చాటుకుంటున్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అనే అంశం చాలా దశాబ్దాల పాటు చర్చలకే పరిమితమైంది. కానీ మేం 2023లోనే దానిపై చట్టం చేశాం. ఆ చట్టం ఆమోదాన్ని పొందిన రోజు, భారత దేశ పార్లమెంటరీ ప్రస్థానంలో స్ఫూర్తిదాయక మైలురాయిగా నిలిచిపోతుంది. యావత్ ప్రపంచం ఆ ఘట్టానికి సాక్ష్యంగా నిలిచింది. దేశ జనాభాలో సగం ఉన్న మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచే దిశగా మా ప్రభుత్వమే ముందడుగు వేసింది. ఇప్పుడు త్వరితగతిన ఆ చట్టాన్ని అమల్లోకి తేవడంపై ఫోకస్ పెట్టాం. దీనితో ముడిపడిన రాజ్యాంగ వ్యవహారాలపై ఇప్పటికే నిపుణులు, రాజకీయ నేతలతో చర్చించాం. దేశ మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేక పార్లమెంటు సెషన్‌లో ఎంపీలంతా ఏకమై మాట్లాడాలి. చారిత్రక మార్పుకు నాంది పలకాలి" అని లేఖలో

# కాళేశ్వరం రిపేర్లు... సవాలే..



**కరీంనగర్ :** ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణలో సమయమే ప్రస్తుతం అదిపెద్ద సవాల్‌గా మారింది. వరదల సీజన్ వేగంగా దగ్గరపడుతున్న నేపథ్యంలో, పరిమిత గడువులోనే విస్తృత స్థాయి మరమ్మతులు పూర్తి చేయాల్సిన పరిస్థితి అధికారుల ముందుంది. ఒకవైపు దెబ్బతిన్న బరాజ్‌లు, పంప్ హౌస్‌లో సాంకేతిక సమస్యలు, మరోవైపు క్లిష్టమైన ఇంజినీరింగ్ పనులు.. ఈ రెండింటినీ సమాంతరంగా పూర్తి చేయడం పెద్ద పరీక్షగా మారింది.

అయితే ప్రాజెక్టులోని బరాజ్‌ల కుంగుబాటు కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో చుక్క నీరు కూడా ఎత్తిపోయని విషయం తెలిసిందే. తాజాగా సీఎం రేవం త్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల పురోగతిపై సమీక్షించిన నేపథ్యంలో ప్రాజెక్టు వినియోగంలోకి రావడంపై ఆసక్తి నెలకొంది.కానీ రాబోయే రెండు, మూడు నెలల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మరమ్మతులు గడువులో పూర్తవుతాయా అన్న ఉత్కంఠ రాష్ట్రవ్యాప్తంగా నెలకొంది. నిర్ణీత గడువులోగా మరమ్మతు పనులు పూర్తి కావడంపై సాగునీటి నిపుణులు సైతం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇలాంటి కీలక సమయం లో ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి.ఇదిలా ఉండగా మరోవైపు నిర్మాణ సంస్థలు పునరుద్ధరణ పనులకు ముం దుకు వస్తాయా అన్న సందిగ్ధత కూడా తెరపైకి వస్తుంది. గతంలో ఎదురైన సాంకేతిక లోపాలు, ఇప్పటికే కాళేశ్వరం నీళ్లు అందక లక్షల ఎకరాల సాగు అనిశ్చితిలో పడిన నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్ కీలకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువులోగా, వరదలు రాకముందే ఈ మరమ్మతులు పూర్తైనే రైతులకు ఊరట, లేకపోతే వ్యవసాయ రంగానికి మరో పెద్దదెబ్బ తప్పదనే భావన మరింత బలపడుతోంది.కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తాజా సమీక్ష, పనులు వేగవంతం చేయాలన్న కఠిన ఆదేశాలతో రైతుల్లో మళ్లీ ఆశ లు చిగురిస్తున్నా యి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో లక్షల ఎకరాల సాగు పూర్తిగా ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడటంతో, మరమ్మతులు త్వరగా పూర్తై నీటి సరఫరా పునరుద్ధరించే నమ్మకం రైతాంగంలో కొంత ఊరటనిస్తోంది. గతంలో ఈ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందిన సమయంలో పంటల దిగుబడులు పెరిగిన అనుభవం రైతులకు ఉన్నందున ఈసారి కూడా అదే పరిస్థితి తిరిగి వస్తుందన్న ఆశ స్పష్టంగా కనిపిస్తోంది.అయితే ఈ ఆశలతోపాటు ఆందోళ నకర పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. గతం లో మేడిగడ్డ వంటి కీలక భాగాల్లో తలెత్తిన సాం కేతిక లోపాలు, మరమ్మతుల్లో జరిగిన ఆలస్యం రైతుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఇప్పటికీ పూర్తిస్థాయి పునరుద్ధరణపై స్పష్టత లేకపోవడం, ప నుల పురోగతిపై అధికారికంగా వెల్లడయ్యే వివరాలు పరిమితంగా ఉండటం రైతుల్లో అనుమా నాలను పెంచుతోంది. ఈసారి నిజంగా గడువులో పూర్తవుతాయా? అనే ప్రశ్న గ్రామాల్లో చర్చనీయాం శంగా మారింది.కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణలో నిర్మాణ సంస్థల స్పందన అత్యంత కీలకంగా మారింది. భారీస్థాయిలో సాంకేతిక మరమ్మతులు, నిర్మాణపరమైన పనులు అవసరమవుతున్న నేపథ్యం లో సంస్థలు ముందుకు వస్తాయా అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా నిలిచింది. గతంలో ఎదురైన సాంకేతిక సమస్యలు, ప్రాజెక్ట్‌పై ఏర్పడిన ప్రతిష్మాత్మక ఒత్తిడి, ఆర్థిక లావాదేవీల అనిశ్చితి కలిసి కాంట్రాక్టర్లలో అభద్రతాభావం నెలకొంది.ముఖ్యంగా మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాల్లో లోపాలు బయటపడిన తర్వాత, మరమ్మతులు సాధారణ పనులు కాకుండా అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్ సవాళ్లుగా మారాయి. ఇలాంటి పనులకు నైపుణ్యం ఉన్న సంస్థలు మాత్రమే ముందుకు రావాల్సి ఉండగా, వాటి సంఖ్య పరిమితంగా ఉండటం కూడా ఒక సమస్యగా మారింది. ఇక చెల్లింపుల విషయంలో అస్పష్టత, గ్యారంటీలు, అదనపు ఖర్చుల భారం ఎవరు భరిస్తారు? అన్న అంశాలు కూడా కీలకంగా మారాయి.ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలు, ప్రోత్సాహకాలు ప్రకటిస్తేనే సంస్థలు ముందుకు వచ్చే అవ కాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. లేకపోతే టెండర్ ప్రక్రియ ఆలస్యం కావడం, పనులు ప్రారంభం కావడంలో జాప్యం ఏర్పడే ప్రమాదం ఉంది. దీంతో కాళేశ్వరం పునరుద్ధరణలో సాంకేతిక అంశాలకంటే నిర్మాణ సంస్థల భాగస్వామ్యం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. పనుల ప్రణాళిక, టెండర్లు, నిర్మాణ సంస్థల ఎంపిక, యంత్రాంగం సమీకరణ వంటి ప్రతి దశలో ఆలస్యం జరిగే అవకాశాలు ఉండటంతో గడువు మరింత కఠినంగా మారుతోంది. ముఖ్యంగా భారీస్థాయి నిర్మాణాల మరమ్మతులకు సాధారణంగా ఎక్కువ సమయం అవసరం ఉండగా, ఇప్పుడు మాత్రం కొద్ది నెలల్లోనే పూర్తి చేయాల్సిన ఒత్తిడి ఏర్పడింది. ఇక ముందస్తు వర్షాలు లేదా అనుకోని వరదలు వస్తే పనులకు అంతరాయం కలిగే ప్రమాదం ఉంది. మరోవైపు అధికారులు రోజువారీ మానిటరింగ్, ప్రత్యేక బృందాల ఏర్పాటు, నిపుణుల పర్యవేక్షణ వంటి చర్యలు గడువుపై ప్రభావం చూపనున్నాయి.కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా సుమారు 8 లక్షల ఎకరాల సాగుభూమి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడిన ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పంటల సాగు పెద్దఎత్తున ప్రభావితమవుతోంది. నీటి సరఫరా నిలిచిపోవ డంతో రైతులు ఏ పంట వేయాలన్న దానిపై స్పష్టత లేక గందరగోళంలో పడుతున్నారు.ఇప్పటికే రాబోయే సాగు సీజన్ దృష్ట్యా రైతులు ప్రణాళికలు సి ద్ధం చేసుకోవాల్సిన సమయంలో, నీటి లభ్యతపై స్పష్టత లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. కొందరు రైతులు తక్కువ నీటితో పెరిగే పంటల వైపు మళ్లుతుండగా, మరికొందరు పూర్తి గా సాగును వాయిదా వేసే పరిస్థితి కనిపిస్తోంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది.

# పొంగులేటి ఉక్కిరిబిక్కిరి

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య అవినీతి అస్త్రాల యుద్ధం పతాక స్థాయికి చేరింది. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా హరీష్ రావు, కేటీఆర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ మంత్రుల స్పందన కేవలం డిఫెన్సివ్ గా మాత్రమే ఉందని, బలమైన కౌంటర్ ఇవ్వడంలో వారు వెనుకబడిపోతున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలు వ్యూహాత్మకంగా మంత్రి పొంగులేటిని ముందు పెట్టి ప్రభుత్వంపై విరుచుకుపడుతు న్నారు. ప్రధానంగా నాదర్‌గుల్ భూముల్లో 7,000 కోట్ల కుంభకోణం జరిగిందని, ఇందులో మంత్రి కుటుంబానికి చెందిన సంస్థల ప్రమేయం ఉందని హరీష్ రావు ఆరోపించారు. దీనికి తోడు రాఘవ కన్స్ట్రక్షన్స్ ద్వారా అక్రమ మైనింగ్ సాగిస్తున్నారని, కొండగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టుల్లో అక్రమాలు జరిగాయని కేటీఆర్ విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఆరోపణలు కేవలం ఒక మంత్రికి పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా ఈ వివాదాల్లోకి లాగుతూ బీఆర్ఎస్ మైలేజ్ పొందుతోంది.బీఆర్ఎస్ చేస్తున్న నిర్దిష్టమైన ఆరోపణలకు కాంగ్రెస్ మంత్రులు ఇస్తున్న సమాధానాలు చాలా బలహీనంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి , ఇతర మంత్రులు ఈ ఆరోపణలను నిరాధారమైనవి అని కొట్టిపారేసినప్పటికీ, ప్రజల్లోకి బలమైన సంకేతం పంపడంలో విఫలమయ్యారన్న అంచనాలు వస్తున్నాయి. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే ఈ ఆరోపణలు చేస్తున్నారు అనే ఒకే మాటను వారు పదే పదే చెబుతున్నారు. దీనివల్ల ప్రస్తుత ఆరోపణలపై స్పష్టత ఇవ్వడం కంటే, పాత విషయాలను తోడటంపైనే వారు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు.బీఆర్ఎస్ నాయకత్వం ఒక టీమ్‌గా విరుచుకుపడుతుంటే, కాంగ్రెస్ వైపు నుండి కేవలం పొంగులేటి మాత్రమే సమాధానం చెప్పాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇతర కీలక మంత్రులు ఈ వివాదాల జోలికి వెళ్లకపోవడం లేదా అరకొరగా స్పందించడం వల్ల ప్రభుత్వం



డిఫెన్స్ లో పడిపోయిందనే భావన కలుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారంలో ఉండటం, ఇక్కడ మంత్రుల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు ప్రజల మెదళ్లలోకి బలంగా వెళ్తున్నాయి. మైనింగ్ ఆదాయంపై బీఆర్ఎస్ లేవనెత్తిన సాంకేతిక అంశాలకు ప్రభుత్వం నుండి పక్కాగా సమాధానం రావడం లేదు. ఇసుక ధరలు పెరిగాయని, ఆదాయం ఎందుకు తగ్గింది? అనే ప్రశ్నలకు మంత్రులు సమాధానం చెప్పలేక, దానిని చిన్న విషయం గా కొట్టిపారేయడం విమర్శలకు తావిస్తోంది. సీఐడీ విచారణకు ఆదేశించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, సిట్టింగ్ మినిస్టర్‌పై సీఐడీ విచారణ ఎలా నిష్పక్షపాతంగా జరుగుతుంది అనే ప్రతిపక్షాల ప్రశ్నకు మంత్రుల దగ్గర గట్టి సమాధానం లేదు.రాజకీయంగా బీఆర్ఎస్ ఇప్పుడు అటాకింగ్ మోడ్‌లో ఉంది. కాంగ్రెస్ మంత్రులు కేవలం ఆరోపణలు నిరూపించండి.. నేను రాజీనామా చేస్తా వంటి పాత డైలాగులతో కాకుండా, డేటా, డాక్యుమెంట్లతో కూడిన కౌంటర్ ఇవ్వాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. లేకపోతే, ఈ అవినీతి ముద్ర ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీసే అవకాశం ఉంది. ముఖ్యంగా పాలనలో పారదర్శకత ఉందని చెప్పుకుంటున్న కాంగ్రెస్, ఇలాంటి ఆరోపణల సమయంలో మరింత వేగంగా ,బలంగా స్పందించకపోతే ప్రజల్లో అనుమానాలు పెరిగే ప్రమాదం ఉందని అనుకోవచ్చు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాలు

**హైదరాబాద్ :** విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాలు అందించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే 1 నుంచి 12వ తరగతి విద్యార్థులు పాలు అందిస్తారు.పంపిణీ కోసం రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి(విజయ డెయిరీ)కి మె?దటి విడతగా.. రూ.120 కోట్ల ఆర్డర్ ఇచ్చింది ప్రభుత్వం. వచ్చే విద్యా సంవత్సరం జూన్‌లో పాఠశాలలు తెరిచేనాటి నుంచి పాలు సరఫరా చేయాలని చెప్పింది. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాలు అందనున్నాయి. విద్యార్థులకు పాలు పంపిణీ చేయాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ బాధ్యతలు విజయ డెయిరీకి అప్పగించాలని ఆదేశాలు ఇచ్చారు.ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయంపూట బ్రేక్ ఫాస్ట్‌తోపాటుగా పాలను అందజేయనున్నారు. విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించడం, వారికి పౌష్టికాహార లోపాన్ని నివారించాలని ప్రభుత్వం అనుకుంటోంది. అందులో భాగంగా ఈ పథకాన్ని తీసుకొస్తుంది. జూన్ నెలలో విద్యాసంస్థలు పున:ప్రారంభం అయ్యే సమయానికి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యాశాఖ అనుకుంటోంది. రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు ఈ పథకం లబ్ధి చేకూరుస్తుంది.ఈ పథకం అమలులో భాగంగా పాల సరఫరా బాధ్యతను ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీకి అప్పగించారు. ఇందుకు రూ.120 కోట్ల విలువైన భారీ ఆర్డర్‌ను ప్రభుత్వం కేటాయించింది. పాలు త్వరగా పాడవకుండా ఉండేందుకు, పంపిణీ సులభతరం చేయడానికి 150-200 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను సిద్ధం



చేయనున్నారు.జూన్ వరకు ఈ ప్యాకెట్లను స్కూళ్లకు చేర్చడానికి డెయిరీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనితో విద్యార్థులకు నాణ్యమైన పాలు అందుతాయనే నమ్మకం వ్యక్తం అవుతోంది.విద్యార్థులకు అందించే ఆహారంలో వైవిధ్యాన్ని, పోషక విలువలను సమపాళ్లలో అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక మెనూను రూపొందించింది. ఇందులో భాగంగా.. వారానికి మూడు రోజులు పాలను, మిగిలిన మూడు రోజులపాటు రాగి జావను పంపిణీ చేస్తారు. రాగి జావలో కాల్షియం, ఐరన్ అధికంగా ఉండటం వలన విద్యార్థులకు ఇది ఎక్కువగా ఉపయోగపడుతుంది. మధ్యాహ్నం భోజనం, ఉదయం పూట పౌష్టికాహారంతో విద్యార్థుల ఎదుగుదల బాగుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాదు పాఠశాలల్లో హాజరుశాతం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

## అటకెక్కిన 'రింగు'..

-మొదటిపేజీ తరువాయి

పిలుస్తారన్న మాట వినిపిస్తోంది. వెరసి, రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగం పనులు ఇప్పట్లో మొదలు కావు.

### ప్రయారిటీ జాబితాలో లేకపోవటమే...

ట్రిపుల్ ఆర్ రెండు భాగాలు పూర్తి చేసేందుకు దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు కానున్నాయి. అందులో ప్రస్తుతానికి ఉత్తర భాగాన్ని మాత్రమే కొలిక్కి తెస్తున్నందున, దానికి రూ.18 వేల కోట్ల వరకు ఖర్చు కానుంది. దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్ వేలు, జాతీయ రహదారుల విస్తరణపై ఫోకస్ చేస్తున్న కేంద్రం వాటిని ప్రయారిటీ లిస్టులో చేర్చుకొని పనులు మొదలుపెడుతోంది. ట్రిపుల్ ఆర్ ప్రయారిటీ జాబితాలో లేదు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలు, రాజకీయంగా లాబీయింగ్ చేస్తున్న రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు వీలు చిక్కుతోంది. గతంలో భారత్‌మాల పరియోజనలో ట్రిపుల్ ఆర్‌ను చేర్చి వేగంగా టెండర్ల ప్రక్రియ వరకు తెచ్చినా, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి--కేంద్రానికి మధ్య ఆ ప్రాజెక్టు భూసేకరణ డబ్బు డిపాజిట్ చేసే విషయంలో పేచీ నెలకొని మాటల యుద్ధానికి దారి తీసింది. దీంతో ట్రిపుల్ ఆర్‌ను అప్పట్లో ప్రయారిటీ జాబితా నుంచి కేంద్రం తొలగించింది. ఇప్పటికీ దాదాపు అదే పరిస్థితి కొనసాగుతోంది. టెండర్లు పిలిచినా, కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆధ్వర్యంలోని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ ఆమోద ముద్ర వేయలేదు.కేంద్ర ఆర్థిక శాఖ పర్యవేక్షణలో ఉండే ఈ కమిటీ ఆమోద ముద్ర వేస్తేనే ఆ ప్రాజెక్టుకు బడ్జెట్ విడుదలవుతుంది. ఆ ఆమోదం లేకుంటే టెండర్లను ఖరారు చేయటం కుదరదు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి ఇప్పుడు ఆ కమిటీ ఆమోదం లభించాల్సి ఉంది. బడ్జెట్ విడుదల కాకపోయేసరికి టెండర్లను ఖరారు చేయలేక అరడజను మార్లు గడువు పొడిగిస్తూ ఎన్‌హెచ్‌ఏఐ కాలయాపన చేయాల్సి వస్తోంది.

### ఖర్చు తగ్గించాలని....

రింగురోడ్డుకు భారీగా ఖర్చు చేయాల్సి రావటాన్ని కూడా ఇటీవల సమీక్షించిన కేంద్ర ఆర్థిక శాఖ, ఖర్చును తగ్గించాల్సిందిగా కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు సూచించింది. ఆమేరకు ఆ శాఖ కార్యదర్శి పలు దఫాలు సమావేశమై, చాలా ప్రత్యేకతల్లో కోత విధించారు. ఏకంగా ఎనిమిది వరుసల రోడ్డును ఆరు వరుసలకే కుదించారు. సర్వీసు రోడ్డు ఆప్షన్ తొలగించారు. రోడ్డు ఎత్తు, అండర్‌పాస్‌ల సంఖ్య తగ్గించారు. చివరకు దానిమీద సెంట్రల్ లైటింగ్ సిస్టంను కూడా తొలగించారు. చివరకు దాన్ని ఎక్స్‌ప్రెస్ వేగా కాకుండా సాధారణ జాతీయ రహదారిగానే నిర్మించాలని తేల్చారు. దాదాపు రూ.4 వేల కోట్ల ఖర్చును తగ్గించటంతో ఇక అనుమతి వస్తుందని అంతా భావించారు. కానీ, ఉత్తర ప్రదేశ్‌లోని ఓ కీలక రోడ్డుకు అనుమతి ఇచ్చి కమిటీ చేతులు దులుపుకొంది. ఇంతలో ఆర్థిక సంవత్సరం ముగిసిపోవటంతో బడ్జెట్ ఖరారుకు వీలుచిక్కదు. కొత్త ఆర్థిక సంవత్సరంలో, మళ్లీ రోడ్ల ప్రయారిటీ జాబితా రూపొందించాల్సి ఉంది. అందులో ప్రాధాన్య రహదారిగా ట్రిపుల్ ఆర్ గుర్తింపు దక్కించుకుంటే జూన్ నాటికి దానికి అనుమతి వచ్చే అవకాశముంది. కాదంటే, ఏడాది చివరి వరకు ఎదురు చూడాల్సిందేనని తెలుస్తోంది.

## వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తా..

-మొదటిపేజీ తరువాయి

కా రణాలతో పార్టీ పెడితే నిలబడదని పేర్కొన్నారు. పార్టీ ఏర్పడి 25 ఏళ్లు అవుతోందని బీఆర్ఎస్‌కు ఉద్యమంలో, అధికారంలో, ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో పనిచేసిన అనుభవం ఉందని చెప్పారు.

### బీఆర్ఎస్ నుంచి టీఆర్ఎస్‌గా..

బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మార్చే ప్రతిపాదన ఉందని, తుది నిర్ణయం అధినేతదే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని తెలిపారు. జిల్లాల ఏర్పాటులో ఎక్కడైనా ప్రజా సౌకర్యాల మేరకు స్థానిక మార్పులు చేస్తే అంగీకరిస్తామని, అయితే జిల్లాలను ఎత్తివేస్తామంటే ఊరుకోబోమని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో లోపాలు జరిగాయని, ఉత్తర తెలంగాణలో ప్రవాసులు అధికంగా ఉండే జిల్లాల్లో గల్ఫ్ పాలసీ తీసుకురాకపోవడంతోపాటు, స్థానిక నాయకులను కలుపుకోకపోవడం, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే కేంద్రంగా పనిచేయడం వంటి లోపాలు జరిగాయన్నారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాన్ని పునర్నిర్మిస్తామని తెలిపారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతారనేది ఓ భ్రమ మాత్రమేనని.. 40 ఏళ్లలో ఎంతమంది జైలుకు వెళ్లి సీఎంలు అయ్యారని ప్రశ్నించారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, జీవన్‌రెడ్డి లాంటి సీనియర్ల చేరిక పార్టీకి మరింత బలాన్నిస్తుందని తెలిపారు. పార్టీలో ఆధిపత్య పోరు లేదని, అధ్యక్షుడు ఎలాంటి వర్క్ ఇస్తే, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆ వర్క్ చేస్తానన్నారు. తాను ఆల్‌రౌండర్‌ను అని, వయసుకు మించి బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

## విస్తరిస్తున్న ప్రచండ వేసవి


-మొదటిపేజీ తరువాయి

పెరిగాయి. 1961--2023 మధ్యకాలంలో, మధ్య అక్షాంశాలలోని భూభాగాలు, తీర ప్రాంతాలు, సముద్రాల్లో ప్రతి సంవత్సరం వేసవికాల వ్యవధి పెరిగింది. తొలి 3 దశాబ్దాల కంటే ఆ తర్వాత మరింత పెరిగింది. 1990--2023 మధ్యలో వేసవి కాలం నిడివి పెరుగుదల సగటు రేటు సుమారుగా దశాబ్దానికి ఆరు రోజులు. అంటే.. 1990తో పోలిస్తే 2023లో వేసవి సుమారు 20 రోజులు ఎక్కువ.

### కొన్ని నగరాల్లో మరీ ఎక్కువ

వేసవికాలం కొన్ని నగరాల్లో సంవత్సరానికి ఒక రోజు కంటే ఎక్కువగా పెరుగుతోంది. ఉదాహరణకు సిడ్నీ (ఆస్ట్రేలియా)లో ప్రతి దశాబ్దానికి వేసవికాలం 14.8 రోజుల చొప్పున పెరుగుతోంది. అంటే 1990లో 80 రోజులుగా ఉన్న వేసవికాలం ఇప్పుడు సుమారు 130 రోజులకు చేరుకుంది. మిన్నియాపోలిస్ (అమెరికా)లో ప్రతి దశాబ్దానికి 9.3 రోజులు, టొరంటో (కెనడా)లో 8 రోజులు పెరుగుతోంది. వేసవిలో వేడి అంతకంతకూ పెరగడం వల్ల మధ్య అక్షాంశ దేశాల్లోని మనుషుల్లో వేడికి తట్టుకునే శారీరక సామర్థ్యం క్షీణించొచ్చు. పగలు, రాత్రి వేళల్లో శరీరాన్ని చల్లబరచుకోవడానికి మరింత శక్తి అవసరం కావొచ్చని అధ్యయనం పేర్కొంది. ఈ పెరిగే వేసవి తీవ్రత ప్రతికూల ప్రభావం పంటలపై కూడా ఉంటుంది. వసంతకాలం నుంచి వేసవికి, వేసవి నుంచి శరదృతువుకు వాతావరణం మారే దశల్లో వేగం పెరిగింది. దీంతో, వేసవి వేడి తీవ్రత కూడా పెరుగుతుందని ఈ అధ్యయనం పేర్కొంది. ఈ మార్పులపై ఆధారపడిన వ్యవస్థలకు సర్దుబాటు చేసుకోవడానికి సమయం తక్కువగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు. ప్రజలు అధిక ఉష్ణోగ్రతలకు ఇంకా అలవాటు పడని సీజన్ ప్రారంభ రోజుల్లోనే ప్రాణాంతకమైన వడగాలులకు దారితీయొచ్చని హెచ్చరిస్తున్నారు.

## బిల్లుకు మద్దతితివ్వకుంటే చరిత్రహీనులు



కేంద్రప్రభుత్వం తీసుకవచ్చిన మహిళా బిల్లును అడ్డుకంటే చరిత్ర హీనులవుతారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. పార్లమెంటులో మహిళా బిల్లుకు అన్ని పార్టీలు మద్దతివ్వాలని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మకమని.. మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిందేనన్నారు. అయితే అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్లకు లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వాలని కోరారు. కాగా ఈ నెల 16,17,18 తేదీలలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి.ఈ నేపథ్యంలో బీజేపీ తమ పార్టీ ఎంపీలకు త్రీ-లైన్-విఫ్ జారీ చేసింది. ప్రభుత్వం కొన్ని కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించుకునే అవకాశం ఉన్నందున సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపింది.

# ఉట్నూర్ బస్‌డిపోపై చిన్నచూపు

**కొత్త బస్సులు కరువు.. పాత బస్సులే దిక్కు**

**భారీ రిపేర్లకు ఆదిలాబాద్ పోవాల్సిందే..**



**ఉట్నూర్ :** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ బస్‌డిపోపై సర్కారు చిన్నచూపు చూస్తున్నది. మారుమూల గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం ఉట్నూర్ డివిజన్ కేంద్రంలో 1993 మార్చి 13న బస్‌డిపోను ప్రారంభించింది. ఉట్నూర్ డిపో ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ పట్టణాలకు మధ్యలో ఉండడం, ఎటుచూసిన 60 నుంచి 100 కిలోమీటర్ల దూరం ఉండడంతో మంచి ఆదరణ లభించింది. హైదరాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, బెల్లంపల్లి, మహారాష్ట్రలోని యావత్మాల్ వంటి ప్రాంతాలకు బస్సులు నడపడం, రైలు మార్గం లేకపోవడంతో మంచి ఆదాయాన్ని సమకూర్చుకున్నది. ప్రభుత్వాలు మారుతున్న కొద్ది డిపోపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. గతంలో 45 బస్సులతో నడిచిన డిపో కేవలం 20 సొంత, 16 ప్రైవేట్ బస్సులతో నడుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కొత్త బస్సులు, కొత్త రూట్లు పెరగకపోవడంతో 2022 సంవత్సరంలో డిపోను ఎత్తివేశారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల ఆందోళనలు మిన్నంటడంతో సబ్‌డిపోగా నడుపుతున్నారు. డిపోకు మేనేజర్ లేకపోగా.. ఆదిలాబాద్ డిపో మేనేజర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బస్సులకు మరమ్మతు అయితే ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే. చిన్న చిన్న మరమ్మతును మాత్రం ఇక్కడి మెకానిక్‌లతో చేయిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలకు కొత్త బస్సులు వస్తున్న ఉట్నూర్ డిపోకు రెండు మాత్రమే వచ్చాయి. ఇక ఎలక్ట్రిక్ బస్సుల ఊసేలేదు. ఆదాయం పెంచే ఆలోచనలో ఆర్టీసీ లేకపోవడం బాధాకరం.జఃఎ ఉ ాశీఝశ్రీ +బఱఅవం

## ఆదాయం రూట్లపై పట్టింపేదీ?

గతంలో ఉట్నూర్ డిపోకు కడెం వయా హైదరాబాద్, కరీంనగర్ వయా హైదరాబాద్, నిర్మల్, నిజామాబాద్, చెన్నూర్, బెల్లంపల్లి, జగిత్యాల పట్టణాలకు బస్సులు నడపడంతో ఆదాయంతోపాటు సరుకులు సరఫరా అయ్యేవి. డిపో పునఃప్రారంభం తర్వాత ఆర్టీనరీ పాత బస్సులను మాత్రమే ఉంచి ఎక్స్‌ప్రెస్‌లను ఇతర డిపోలకు పంపించారు. ఉన్న ఆర్డినరీ బస్సులకు వచ్చే ఆదాయంతోపాటు రిపేర్లు అదేస్థాయిలో వస్తూ నష్టాన్ని మిగిల్చాయి. దీనికితోడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మీ పథకం 'బస్సులు ఫుల్.. ఆదాయం నిల్'గా మార్చాయి. మహాలక్ష్మీ స్కీం రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కావడంతో నష్టాలే మిగిలాయి. మళ్లీ డిపోకు ఆదాయాన్ని పెంచేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఉట్నూర్ బస్టాండ్ ప్రధాన రహదారికి అనుకొని ఖాళీ స్థలం ఉంది. ఇందులో షెట్టర్లు, షాపింగ్ మాల్స్ నిర్మిస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. కనీసం.. 50కిపైగా ప్రధాన రహదారికి అనుకొని షట్టర్లు నిర్మించే అవకాశం ఉంది. కోట్ల రూపాయల విలువ చేసే భూమి ఉన్న పట్టించుకోవడం లేదు.

## ప్రైవేట్‌కే మక్కువ

ఆర్టీసీ యాజమాన్యం డిపోలను ప్రైవేట్ పరం చేసేందుకే ఆసక్తి కనబరుస్తున్నది. ఉట్నూర్ డిపోలో 20 ఆర్టీసీ బస్సులు ఉండగా.. 16 ప్రైవేట్ వాహనాలు ఉన్నాయి. ప్రైవేట్ వాహనాలకు డ్రైవర్, డీజిల్‌తోపాటు మెకానిక్ ఖర్చు కూడా ఉండకపోవడంతో ఎక్కువగా ప్రైవేట్‌కే మొగ్గు చూపుతున్నారు. ఉట్నూర్ డిపో నుంచి సరైన బస్సులు హైదరాబాద్‌కు నడపకపోవడంతో సుమారు నాలుగు ప్రైవేట్ వాహనాలు నడుపుతూ ఆదాయానికి గండికొడుతున్నారు. ఉన్న వాహనాలు పాతబడడం, సరైన మెయింటెనెన్స్ లేకపోవడం వల్ల ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలకే మొగ్గు చూపుతున్నారు. ఆర్టీసీ చార్జీలు తక్కువ ఉన్నా ప్రైవేట్‌నే ఆశ్రయిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

# రైస్ మిల్లర్ల నిలువు దోపిడీ




**నకిరేకల్ :** నకిరేకల్ మండలంలోని పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లుల్లో రైతుల నిలువు దోపిడీ ఆగడం లేదు. తాలు పేరుతో క్వింటాకు 10 నుంచి 12 కిలోల తరుగుకు ఒప్పుకుంటే దిగుమతి చేస్తామని, లేకుంటే దిగుమతి చేసుకోమని బాహటంగానే చెబుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో వారం రోజులుగా ఆయా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు నిలిచిపోయాయి. ఇంత జరుగుతున్నా డీటీసీఎస్, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన యాసంగి ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. ఓ వైపు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అధికారుల అలసత్వం కారణంగా రైతులు అవస్థలు పడుతుంటే, మరో వైపు తాలు, తరుగు పేరుతో రైస్ మిల్లుల యాజమాన్యాలు రైతులను నిండా ముంచుతున్నాయి. నకిరేకల్ మండలంలో గోరెంకలపల్లి, మర్రూర్, మంగళపల్లి, మండలాపురం, చందుపట్ల, చీమలగడ్డ, తాటికల్, బైరెడ్డిగూడెం, కడపర్తి, ఓగోడు, వల్లభాపురం, టేకులగూడెం, నోముల, నెల్లిబండలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 6 కేంద్రాలు మినహా 8 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇంతవరకు కాంటాలు ప్రారంభించ లేదు. కాంటా వేసిన లారీలు పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లుల్లో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ కేంద్రాల నుంచి కాంటా వేసిన ధాన్యాన్ని మండలంలోని పవన్‌సాయి, వినాయక, శ్రీ హరికృష్ణ, శ్రీలక్ష్మీ సరస్వతి, శ్రీ లక్ష్మీసాయి, మహీంద్ర, శ్రీ వైష్ణవి, బీఎంవీ ఆగ్రో, విజయదుర్గ, శివశక్తి ఆగ్రో ఇండస్ట్రీస్, పారాబాయిల్డ్ రైస్‌మిల్లులకు పంపుతున్నారు. ఒక్కో రైసు మిల్లు వద్ద 2 నుంచి 3 లారీలు దిగుమతి చేసుకోకుండా నిలిపివేసిన పరిస్థితి నెలకొంది. యాసంగి పంటల్లో కాసింత తాలు ఉన్నప్పటికీ అదే అదునుగా భావించిన కొన్ని పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు తమను తాలు, తరుగు పేరుతో ముప్పుతిప్పలు పెడుతూ నిలువు దోపిడీ చేస్తున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరుగుకు అంగీకరించకుంటే ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా... కొనుగోలు కేంద్రాల వద్ద తమకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సెంటర్లపై క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తాలు, తరుగు పేరుతో మిల్లర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా డీటీసీఎస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో పట్టించుకోవడం లేదనే విమర్శలు లేకపోలేదు. తాలు తరుగుపై, మిల్లర్లపై, నిర్లక్ష్యం వహించిన అధికారులపై కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

# విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా లేవు



మెదక్ జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలను మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు ఎం పద్మా దేవేందర్ రెడ్డి ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి సంబంధించి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఐవీజు)కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. 120 మంది విద్యార్థులకు ఒకే టాయిలెట్ ఉండటం దురదృష్టకరమని అన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారని, కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు చేస్తున్నారని మండిపడ్డారు. కళాశాలలో డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థుల నుంచి అదనపు మెస్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని హెచ్చరించారు. వారం రోజుల్లోనే కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రభుత్వం, అధికారులకు గడువు విధించారు. లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో మెడికల్, నర్సింగ్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం వాటిలో సరైన సదుపాయాలు కల్పించడం లేదని విమర్శించారు. విద్యార్థులు మంచి శిక్షణ పొందితే భవిష్యత్తులో సమాజానికి మెరుగైన సేవలు అందిస్తారని పేర్కొన్నారు. వీరి వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మెదక్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మామిళ్ల ఆంజనేయులు. న్యాయవాది జీవన్ రావు, పట్టణ , కౌన్సిలర్లు బట్టి ఉదయ్, దీపక్ కుమార్, నాయకులు లింగా రెడ్డి, సురేందర్ గౌడ్,కిష్ట గౌడ్, మాయ మల్లేశం , ఆర్కే శ్రీనివాస్, సంతోష్, సాయి కుమార్, నవీన్, బాలరాజు, శ్రీలత వెంకట్ ,కిరణ్, స్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

## ఇంటర్‌లో ఫెయిల్ అవుతానన్న భయంతో సూసైడ్.. కానీ మెరిట్ మార్కులతో పాస్!




ఇంటర్ ఫలితాల వేళ తీవ్ర విషాదం నెలకొంది. పరీక్షల్లో ఫెయిల్ అవుతాన్న భయంతో ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం జిల్లాలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బోనకల్ మండలం రాంపల్లి గ్రామానికి చెందిన గంగదేవుళ్ల అక్షాంత్ ఇటీవల ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాశాడు. కానీ పరీక్షలు సరిగ్గా రాయలేదని తెగ బాధపడ్డాడు. ఈ క్రమంలోనే రెండు రోజుల కింద మధిరలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆదివారం ఇంటర్ బోర్డు విడుదల చేసిన ఫలితాలను చెక్ చేయగా అన్ని సబ్జెక్టులు పాస్ కావడం గమనార్హం. అక్షాంత్‌కు సబ్జెక్టుల వారీగా ఇంగ్లీష్‌లో 67, సంస్కృతంలో 60, మ్యాథ్స్-1లో 40, మ్యాథ్స్-2లో58, ఫిజిక్స్‌లో 49, కెమిస్ట్రీలో 54, ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌లో 19 మార్కులు వచ్చాయి. మొత్తంగా ఫస్టియర్‌లో 470 మార్కులకుగానూ 347 మార్కులు సాధించిన బీ గ్రేడ్‌లో ఉత్తీర్ణుడయ్యాడు. కానీ ఫలితాలు రాకముందే, ఫెయిల్ అవుతాననే భయంతో అక్షాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు విలపిస్తున్నారు. ఇవాళ ఫలితాల వెల్లడి ఉండటంతో టెన్షన్ పడిపోయాడు. పరీక్షల్లో ఫెయిల్ అవుతాననే భయంతో మధిరలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే కొద్దిసేపటి క్రితం విడుదలైన ఫలితాల్లో 347 మార్కులు సాధించి, ఇంటర్ ఫస్టియర్ పాసయ్యాడు. ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## రైతులు అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను వాడాలి.. జెనోమిక్స్ సీడ్స్ సంస్థ టీఎస్ఎం సీహెచ్ నాగయ్య



**చండూర్ :** రైతులు అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను వాడాలని జెనోమిక్స్ సీడ్స్ సంస్థ టీఎస్ఎం సీహెచ్ నాగయ్య అన్నారు. జెనోమిక్స్ సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామంలో జెనోమిక్స్ సీడ్స్ సంస్థ ప్రతినిధులు రైతు కట్కూరి నరసింహ వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి, టీఎస్ఎం సీహెచ్ నాగయ్య మాట్లాడుతూ ప్రతీ ఒక్క రైతు కొత్త వంగడాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. నాణ్యతతో కూడిన ఎక్కువ దిగుబడి ఇచ్చే రకాలను రైతులు పండిస్తే లాభసాటీగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు ఈ సందర్భంగా రైతు వేసిన కొత్త రకం వరి పంటను పరిశీలించి రైతు అధిక దిగుబడి సాధించిన రైతులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతన్న ట్రేడర్స్ డీలర్ దొమ్మాటి స్వామి, సంస్థ ప్రతినిధి నకిరేకంటి సైదులు గౌడ్, రైతులు మారగొని పాపయ్య, వరికుప్పల యాదగిరి, చొల్లేటి దశరథ, ఒట్టి కోటి శ్రీనివాస్, కటుకూరి సత్తయ్య, కారింగు నరసింహ, వరికుప్పల ముత్తయ్య, వరికుప్పల శ్రీనివాస్, ఎంపల్ల నరసింహ, దేవసారి యాదయ్య, ఓర్సు వెంకన్న, కట్కూరి కృష్ణయ్య, కట్కూరి నరసింహ, వరీకుప్పల వీరయ్య, రేవల్లి మహేష్, కారింగు రాజు, వరికుప్పల వెంకన్న, జక్కలి సిద్దు, నౌసు రాజు తదితరులు పాల్గొన్నారు

## పంట మార్పిడి చేయమంటాడు.. చేస్తే వాటిని కొనడు.. సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం



కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుననదని.. పంట కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. పంట కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్లను ప్రారంభించలేదని.. వెంటనే కొనుగోలు సెంటర్లను ప్రారంభించి, మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ లను అధికారులు సందర్శించాలని సూచించారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్లను ప్రారంభించకపోవడంతో రైతులు తక్కువ ధరకు పంటను అమ్ముకుని నష్టపోతున్నారని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం అని అన్నారు. పలు జిల్లాలలో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలన్నారు.

## వివేకానంద మినీ స్టేడియం అభివృద్ధికి కృషి సమీండ్ల వాణి

**జగిత్యాల :** శారీరక దృఢత్వానికి వాకింగ్ వంటి అలవాట్లు ఎంతో ఉపయోగకరమని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి అన్నారు. జగిత్యాల పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించిన డెయిలీ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజువారీ వ్యాయామం చేయాలని సూచించారు. వివేకానంద మినీ స్టేడియంలో వాకర్స్‌కు అవసరమైన సౌకర్యాల అభివృద్ధికి మున్సిపాలిటీ తరఫున తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలు, అవసరాలను చైర్ పర్సన్‌కు వివరించగా, వాటిని ప్రాధాన్యతగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అరవ లక్ష్మి, అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, వాకర్స్ పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com